పర్యవేక్షణ ఎక్కడ?

- విద్యాలయాల్లో కనిపించని ఫుడ్, పేరెంట్స్ కమిటీలు
- నామమాత్రంగా తనిఖీలు
- పత్తాలేని ఫుడ్ ఇన్‌స్పెక్టర్
- పట్టించుకోని ఉన్నతాధికారులు



గతేడాది మైనారిటీ గురుకుల పాఠశాలలో భోజనాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్సు అధికారులు (ఫైల్)

బాన్సువాడ: మంది ఎక్కువైతే.. మజ్జిగ పలుచన అవుతాయి అన్న చందంగా మారింది విద్యాలయాల్లో ఆహార తనిఖీల ప్రక్రియ. గురుకులాలు, కేజీబీవీల సంఖ్య పెంచామని గొప్పగా చెప్పుకొనే పాలకులు విద్యార్థులకు సరిపడా సౌకర్యాలు, అందించే ఆహారంలో నాణ్యతా ప్రమాణాలను పాటించేలా చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యాలయాలు, హాస్టళ్లకు సరఫరా చేస్తున్న కూరగాయలు, మాంసం, కిరాణ సామగ్రి టెండర్లను ఏళ్ల తరబడి ఒక్కరికే ఇవ్వడం వల్ల నాసిరకమైన వస్తువుల సరఫరాకు కారణమవుతున్నాయి. ఇక కూరగాయల విషయానికి వస్తే..అతి తక్కువ ధరకు టెండర్లు దక్కించుకునే కూరగాయల విక్రయదారులు మార్కెట్‌లో విక్రయించగా మిగిలిన ఆకు, కూరగాయలను సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో గతేడాది బీర్కూర్ మండల కేంద్రంలో 60 మంది విద్యార్థులకు పైగా ఆహార కల్తీతో అస్వస్థతకు గురికావడం ఇందుకు నిదర్శనం. మీడియాలో వార్తలు వచ్చిన తర్వాతనే అధికారులు స్పందన ఉందంటే పర్యవేక్షణ ఏ తీరున ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఫుడ్ కమిటీలు ఎక్కడ..?

గురుకులాలు, కేజీబీవీ, పాఠశాలలు, హాస్టళ్లలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో ఫుడ్, పేరెంట్స్ కమిటీలను ఏర్పాటు చేయాలి. ఈ కమిటీలు నిర్దేశిత సమయాల్లో అక్కడి ఆహారం, సరఫరా చేస్తున్న పాలు, మాంసం, ఆకు, కూరగాయలు, కిరాణా సామాగ్రి, తాగునీటిలో నాణ్యతా ప్రమాణాలు పరిశీలిస్తూ..విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేలా పర్యవేక్షించాలి. అయితే కరోనా వైరస్ విజృంభించిన తర్వాత ఈ నిబంధనలను అధికారులు పట్టించుకోని కారణంగా కమిటీల ఏర్పాటును పక్కనపెట్టినట్లు సమాచారం. గత ఏడాది డిసెంబర్‌లో ఉమ్మడి జిల్లా విజిలెన్స్ అధికారులు బోర్లం మైనార్టీ గురుకుల పాఠశాలను తనిఖీ చేసి వెళ్లారు తప్ప మిగతా ఏ గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన పాపాన పోలేదు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఇప్పటి వరకు ఏ పాఠశాలను కానీ, గురుకుల పాఠశాలను తనిఖీలు చేసిన సందర్భాలు దారిదాపుల్లో కనిపించవు. ఇప్పటికైనా పాలకులు పాఠశాలల్లో ఫుడ్ పేరెంట్స్ కమిటీలను నియమించాలని విద్యార్థులు కోరుతున్నారు.

క్లుప్తంగా

కూలీలందరికి పని కల్పించాలి



కామారెడ్డి రూరల్: జాతీయ ఉపాధిహామీ పథకం కింద జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలని ఎంపీడీవో నాగవర్ధన్ సూచించారు. బుధవారం చిన్నమల్లారెడ్డిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ప్రతి రోజు ఎంత మంది కూలీలు పనికి వస్తున్నారని ఈజీఎస్ ఏపీవో నరేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ కింద నడుస్తున్న పనుల వివరాలను ఏపీవోను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పనుల్లో లేబర్ శాతాన్ని పెంచాలన్నారు. కొలతల ప్రకారమే కూలి చెల్లించాలన్నారు. ఎంపీవో మలహరి, ఏపీవో నరేందర్, తదితరులు ఉన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలో బుధవారం ఉపాధి కూలీలు పని చేస్తున్న ప్రదేశాన్ని ఎంపీవో రాము పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని సిబ్బందికి ఆదేశించారు. వేసవి తాపం పెరుగుతున్న దృష్ట్యా మంచి నీటి సౌకర్యం, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఏపీవో సౌజన్య ఉన్నారు.

పశువైద్య శిబిరం



కామారెడ్డి రూరల్: రామేశ్వర్‌పల్లిలో బుధవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా నాలుగు గేదేలకు కృత్రిమ గర్భదారణ, 39 పశువులకు చూడి పరీక్షలు, 18 పశువులకు సాధారణ చికిత్సలు చేశారు. 2వ వార్డు కౌన్సిలర్ సుతారి రవి, డాక్టర్ రవి కిరణ్, డాక్టర్ రమేష్, గోపాల మిత్ర సూపర్ వైజర్‌లు కృష్ణ, శ్రీకర్, గోపాల మిత్రలు శ్రీనివాస్, బాలయ్య, పశు వైద్య సిబ్బంది ప్రవీణ్‌గౌడ్, బాల్‌నర్సు, పాల కేంద్రం మాజీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

బాన్సువాడ రూరల్: జూన్‌లో చేపట్టే తెలంగాణకు హరితహారం కార్యక్రమం విజయవంతం కావాలంటే ఇప్పటి నుంచే గ్రామ నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన సోమేశ్వర్, దేశాయిపేట్, పోచారం గ్రామాల్లో పర్యటించి నర్సరీలను పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

బ్యాగులు, దుస్తుల పంపిణీ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట కస్తూర్బా పాఠశాలలోని విద్యార్థినులకు బుధవారం కామారెడ్డిలోని శ్రీరామ సేవా సమితి సభ్యులు బ్యాగులు, బట్టలు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. పాఠశాలలోని 235 మంది విద్యార్థినులకు ఒక జత చొప్పున బట్టలు, వాటర బాటిళ్లను అందజేశారు. వాటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని సేవా సమితి సభ్యులు తెలిపారు. నిరుపేద బాలికల చదువు కోసం తమవంతు సహకారం అందిస్తున్నామని వారు చెప్పారు. ప్రిన్సిపాల్ వీణతో పాటు శ్రీరామ సేవా సమితి సభ్యులు నర్సింలు, గిరిధర్, బుచ్చయ్య, వెంకటేశం, గంగాధర్ పాల్గొన్నారు.

వదల్‌పర్తిలో గ్లాసులు..

వదల్‌పర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గ్లాసులను అందజేశారు. పాఠశాలలో ప్రతిరోజూ అంబలి తాగేందుకు వారు గ్లాసులను పంపిణీ చేశారు. సాయి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు చక్రవర్తిగౌడ్, పాఠశాల హెచ్‌ఎం కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవం



లింగంపేట(ఎల్లారెడ్డి): పర్మళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదవ తరగతి విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులు ఒక రోజు ఉపాధ్యాయులుగా మారి కింది తరగతి విద్యార్థులకు విద్యా బోధన చేశారు. శ్రీసాయి చారిటబుల్ ట్రస్ట్ కామారెడ్డి అధ్యక్షుడు ఎంజీ చక్రవర్తిగౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హెచ్‌ఎం సందీప్ కుమార్, నాగరాజు రావు, వినయ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ యోజనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి

లింగంపేట(ఎల్లారెడ్డి): సంప్రదాయ చేతి వృత్తులు, హస్త కళాకారులను బలోపేతం చేయడంతో పాటు ఆర్థికంగా చేయూత అందించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ యోజనను ప్రజలందరూ సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ పథకం పట్ల గ్రామ, మండల స్థాయిలో చేతి, కుల వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారిలో సామర్థ్యం మెరుగుపర్చి, ఉత్పాదకత, నాణ్యత, ఉత్పత్తులను పెంచడం పథకం ఉద్దేశమన్నారు. ఈ పథకానికి ఎంపికైన వారికి రెండు రకాల శిక్షణ ఉంటుందన్నారు. ప్రాథమిక నైపుణ్యాల ద్వారా ఏడు రోజులు, ఆధునాతన నైపుణ్యాల ద్వారా 15 రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం రూ. 15 వేల విలువైన టూల్ కిట్లు, ధ్రువీకరణపత్రం అందజేస్తామన్నారు. మూడు విడతలుగా రూ.లక్ష, రూ.2 లక్షలు, రూ.3 లక్షలు రుణం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడతలో 5 శాతం వడ్డీతో 18 నెలలు చెల్లించాలన్నారు. రెండో విడత రూ.2 లక్షలను 36 నెలల్లో చెల్లించాలన్నారు. దశల వారీగా గ్రామ, మండల ప్రాంతాలలో అర్హులైన ప్రతీ ఒక్కరికి లబ్ధి చేకూర్చనున్నట్లు తెలిపారు. ఎంపీవో ప్రభాకరచారి, కార్యదర్శులు పాల్గొన్నారు.

వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి



దోమకొండలో మాట్లాడుతున్న ఎంపీడీవో తిరుపతి రెడ్డి



కామారెడ్డిలో.. ఎంపీడీవో నాగవర్ధన్



నాగిరెడ్డిపేటలో.. ఎంపీవో శ్రీనివాస్

దోమకొండ: మండలంలో 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీవో తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధి హామీ సిబ్బందికి సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్(జీపీడీపీ) తయారు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఏపీవో రజనీ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కామారెడ్డిలో..

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్లు, కార్యదర్శులు, ఈజీఎస్ అధికారులతో ఎంపీడీవో నాగవర్ధన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెలాఖరులోగా అన్ని గ్రామాల్లో వందశాతం పన్నులు వసూలు చేయాలన్నారు. అంతేకాకుండా తాగునీటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏడీఏ అపర్ణ, ఎంపీవో మలహరి, ఏవో శ్రీనివాస్‌రావు, తదితరులున్నారు.

నాగిరెడ్డిపేటలో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో ఎంపీవో శ్రీనివాస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీపీడీపీ ప్రణాళికను త్వరగా ఆన్‌లైన్ చేయించాలన్నారు. దీంతోపాటు పీఎం విశ్వకర్మ పథకానికి సంబంధించి గ్రామ పంచాయతీల యూజర్ లాగిన్‌లను వెంటనే ఆక్టివేట్ చేసుకోవాలని చెప్పారు.

సమాచారం..

నేటితో ముగియనున్న మోడల్ స్కూల్ దరఖాస్తుల తుది గడువు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ప్రవేశం పొందటానికి గురువారంతో ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు ముగుస్తుందని ప్రిన్సిపాల్ భానుమతి బుధవారం తెలిపారు. అత్యధికంగా దరఖాస్తులు ఆరో తరగతికి వచ్చినట్లు తెలిపారు. ఆరవ తరగతిలో వంద సీట్లు, మిగిలిన తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను మాత్రమే భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

23న సీనియర్ కబడ్డీ క్రీడాకారుల ఎంపిక

కామారెడ్డి అర్బన్: తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కామారెడ్డి లయోల హైస్కూల్‌లో సీనియర్ పురుషుల కబడ్డీ క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగా వెంకటేశ్వర్‌గౌడ్ తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు 85 కిలోల లోపు బరువు ఉండాలని, ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు మార్చి 2, 3, 4 తేదీల్లో నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలో నిర్వహించే రాష్ట్ర స్థాయి 70వ అంతర్‌జిల్లాల కబడ్డీ చాపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బాణాల భాస్కర్‌రెడ్డి(9398571110)ని సంప్రదించాలని సూచించారు.

గంగామాత ఆలయ వార్షికోత్సవాలు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పెద్ద చెరువు వద్ద గల గంగమ్మ దేవాలయం 22వ (ద్వావిశంతి) వార్షికోత్సవాలు ఈనెల 23, 24, 25 తేదీల్లో నిర్వహించనున్నట్లు పట్టణ మత్స్యపారిశ్రామిక సహకార సంఘం, గంగాపుత్ర సంఘం ప్రతినిధులు జి.లక్ష్మీనారాయణ, పాక నారాయణ, విజయ్‌కుమార్‌లు తెలిపారు. ప్రత్యేక పూజలతో పాటు అన్నదాన కార్యక్రమాలుంటాయని వివరించారు.

కష్టపడి కాదు..ఇష్టపడి చదవాలి

- సీఐ సంతోష్ కుమార్



సదాశివనగర్(ఎల్లారెడ్డి): విద్యార్థులు కష్ట పడి చదవడం కాదు.. ఇష్టపడి చదవాలని సీఐ సంతోష్‌కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షికోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రతి సబ్జెక్టును నిర్లక్ష్యం చేయకుండా శ్రద్ధతో చదవాలన్నారు. వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించి కళాశాలకు పేరు తీసుకురావాలన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం, ప్రిన్సిపాల్స్ అజ్మల్‌ఖాన్, ఎస్సై రాజు, ఏఎస్సై సాగర్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



అన్నాసాగర్‌లో పనులను ప్రారంభిస్తున్న గ్రామస్తులు



పెద్దమల్లారెడ్డిలో ..

ఎల్లారెడ్డి: అన్నాసాగర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను గ్రామస్తులు బుధవారం ప్రారంభించారు. గ్రామానికి సీసీ రోడ్డు కోసం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పది లక్షల రూపాయల నిధులను మంజూరు చేయడంతో వాటితో పనులను ప్రారంభిస్తున్నట్లు వారు తెలిపారు. మాజీ సర్పంచ్ గురుప్రతాప్, నాయకులు అజర్ తదితరులున్నారు.

పెద్ద మల్లారెడ్డిలో రూ.25 లక్షలతో..

భిక్కనూరు: ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సహకారంతో భిక్కనూరు మండలం పెద్ద మల్లారెడ్డి గ్రామానికి మంజూరైన రూ.25 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని ప్రత్యేకాధికారి సూచించారు. మండల ప్రత్యేకాధికారి సుష్మారెడ్డి, గ్రామ ప్రత్యేకాధికారి ఆనందం, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ, డీసీసీ ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, ఎంపీపీ గాల్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు బల్యాల సుదర్శన్, టి.లింబాద్రి పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ప్రతి రోజు దివ్యాంగ పిల్లలకు క్రమం తప్పకుండా ఇంటి దగ్గర వ్యాయామాలు చేయించడం వల్ల మంచి ఫలితాలు వస్తాయని ఫిజియోథెరపిస్ట్ విశాలాక్షి అన్నారు. బుధవారం ఎంఆర్‌సీ కార్యాలయంలో ఫిజియోథెరపి క్యాంప్ నిర్వహించి, దివ్యాంగ పిల్లలకు వ్యాయమాలు చేయించారు. అనంతరం తల్లిదండ్రులకు వ్యాయమాల గురించి సూచనలు, సలహాలిచ్చారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కిషన్, రాందాస్, రాథోడ్ బలరాం, కంప్యూటర్ ఆపరేటర్ పవిత్ర పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన పలు గ్రామాల పెద్దలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయికి కొత్తగా వచ్చిన ఎస్సై వెంకటేశ్వర్లును బుధవారం పలు గ్రామాల ప్రజలు కలిశారు. చిట్యాల, కన్‌కల్, బ్రహ్మాజీవాడి, సంగోజీవాడి, చందాపూర్, ఎర్రాపహాడ్, సంతాయిపేట్ తదితర గ్రామాలకు చెందిన గ్రామ పెద్దలు, నాయకులు మర్యాద పూర్వకంగా కలసి సన్మానం చేశారు. సాయిరెడ్డి, పులి బాబు, ఎల్లాగౌడ్, తదితరులున్నారు.

టోల్‌ప్లాజా యూనియన్ కార్యవర్గం

భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలోని టోల్‌ప్లాజా యూనియన్ కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాసాల నర్సాగౌడ్, ఉపాధ్యక్షులుగా అంబల్ల సాయి నిఖిల్, తమ్మల సిద్ధరాములు, ప్రధాన కార్యదర్శిగా మన్నే రాజశేఖర్ సహాయ కార్యదర్శులుగా బల్ల రాజశేఖర్, స్వామి, కోశాధికారిగా బల్వంత్‌రెడ్డి, తదితరులు ఎన్నికయ్యారు.

రైతులు ఆర్థికంగా ఎదగాలి

ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



బిచ్కుందలో సొసైటీ గోదామును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

బిచ్కుంద(జుక్కల్): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా ఆదుకోవడానికి సిద్ధంగా ఉందని, రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకొని ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. బుధవారం బిచ్కుంద రైతు సహకార సంఘంలో నిర్మించిన గోదామును, మహిళ సమాఖ్య భవనం, మార్కెట్ యార్డులో మాజీ ఎంపీ సురేష్ షెట్కార్ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.36 లక్షల నిధులతో గోదాం నిర్మాణం చేశామన్నారు. కౌలాస్ ప్రాజెక్టు కింద 9 వేల ఎకరాలకు సాగునీరు అందేదని, గత పాలకులు పట్టించుకోక పోవడంతో కాలువలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. రెండు వేల ఎకరాలకు కూడా ప్రస్తుతం నీరు అందడం లేదన్నారు. జుక్కల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనకబాటుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వమే కారణమని విమర్శించారు. అనంతరం వాజిద్‌నగర్‌లో కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీ, బిచ్కుందలో మున్నూర్‌కాపు సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు సన్మానసభ నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు గడ్డం అరవింద్, సోపాన్, బొమ్మల్ లక్ష్మణ్ సన్మానించారు. సంఘం భవనం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు.

త్వరలోనే బిచ్కుంద మున్సిపాలిటీ..

త్వరలోనే బిచ్కుంద మండలం మున్సిపాలిటీ అవుతుందని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వానికి నివేదిక అందించామని, మంత్రి సానుకూలంగా స్పందించారని, నెల రోజులలో ప్రకటన వస్తుందన్నారు. అన్ని ఆస్పత్రులలో వైద్యులను నియమించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్ పటేల్, సొసైటీ చైర్మన్ బాలు, కాంగ్రెస్ నాయకులు వెంకట్ రెడ్డి, విఠల్‌రెడ్డి, రాజు షెట్కార్, షేక్ పాషా, నౌషా నాయక్, గంగాధర్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బీసీ కాలనీలో తాగునీటి సమస్యలు తీర్చాలని కోరుతూ బుధవారం కాలనీవాసులు ఆందోళన చేశారు. వారం రోజుల నుంచి మిషన్ భగీరథ ద్వారా తమకు తాగునీరు సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు, యువకులు తమ ఇళ్ల నుంచి ఖాళీ బిందెలతో వచ్చి రోడ్డుపై గంట పాటు నిరసన తెలిపారు. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు సమాచారాన్ని అందించారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి తాడ్వాయికి నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. దీంతో మొబైల్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. అయినా ఈ నీరు మాకు వద్దని మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీటినే సరఫరా చేయాలని కాలనీవాసులు కోరారు. ఈ నీళ్లు తాగడానికి పనికి రావాని, బట్టలు ఉతకడానికి మాత్రమే పనికి వస్తాయని అన్నారు.

అయోధ్యకు బయలుదేరిన భక్తులు



లింగంపేట నుంచి బయలుదేరి వెళ్తున్న రామ భక్తులు



తాడ్వాయి మండలం నుంచి ..

సాక్షి నెట్‌వర్క్: జిల్లా నుంచి రామ భక్తులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం అయోధ్యకు బయలుదేరి వెళ్లారు. బాలరాముడిని దర్శనం చేసుకునే ముందు స్థానికంగా ఉన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జై శ్రీరామ్ నామస్మరణ చేస్తూ ర్యాలీగా తరలివెళ్లారు.



బీర్కూర్ నుంచి..



భిక్కనూరు మండలం తిప్పాపూర్ నుంచి..

పాఠశాలలో మోటివేషనల్ తరగతులు



ప్రసంగిస్తున్న తిరునగరి శ్రీహరి

రాజంపేట: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం మోటివేషనల్ తరగతులు నిర్వహించారు. కామారెడ్డి సాందీపని కళాశాలల యాజమాన్యం సహకారంతో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సహచర్యంలో శిక్షణ పొందిన శ్రీ తిరునగరి శ్రీహరి ఆధ్వర్యంలో ఈ మోటివేషనల్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉత్సాహపరిచి, లక్ష్య సాధన క్రమంలో మెలకువలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి హెచ్‌ఎం స్వర్ణలత, ఉపాధ్యాయ బృందం, సాందీపని కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీ కృష్ణ మందిర నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న గ్రామస్తులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మైలారం గ్రామంలో శ్రీ కృష్ణ మందిర నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ పెర్క శ్రీనివాస్ మాట్లాడారు. నూతనంగా నిర్మించే మందిరం పనులు యుద్ధ ప్రాతిపదికన సాగాలన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన పెరిగితేనే యువత వ్యసనాలకు దూరంగా ఉంటారన్నారు. మాజీ సర్పంచ్ సాయిరాం, మాజీ ఎంపీటీసీ మహేందర్, యాదవ సంఘం సభ్యులు మేకల రాములు, బొట్టె మోహన్, తదితరులు ఉన్నారు.